క్లుప్తంగా

డాక్టర్ శ్రీనివాసరెడ్డికి సన్మానం



పెదకూరపాడు: కొరిశపాడు మండలం దైవాలరావూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కిరణ్ జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌కు ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరైన పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం 75త్యాళ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డిని ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడిగా, వ్యాసకర్తగా, కవిగా చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా శ్రీనివాసరెడ్డిని సన్మానించినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ అబ్దుల్ కలాంతో కలిసి పని చేసిన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.మురళి వరప్రసాద్, ఎన్నారై, తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం హాజరయ్యారు. కార్యక్రమంలో కిరణ్ జ్యోతి ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ ప్రొఫెసర్ కె.రాజశేఖర్, డీవైఈవో గంగాధరరావు, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాధిక్, ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పీవీ శ్రీనివాసులు, స్థానిక హెచ్‌ఎం ఏడుకొండలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు స్మరించుకోవాలి

నకరికల్లు: స్వాతంత్య్రం కోసం పోరాడిన అమరుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి పిలుపునిచ్చారు. కామ్రేడ్ జతిన్‌దాస్ 96వ సంస్మరణ సభను శనివారం స్థానిక భగత్‌సింగ్ హాల్‌లో నిర్వహించారు. జతిన్‌దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, రాజకీయ ఖైదీల హక్కుల కోసం ప్రాణాలర్పించిన జతిన్‌దాస్ దేశభక్తి స్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీ గిరిజనసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటానాయక్, పీడీఎం సీనియర్ నాయకుడు వై.వెంకటేశ్వరరాజు, జిల్లా కోఆర్డినేటర్ బోయిన ప్రసన్నకుమార్, కౌలురైతు సంఘం మండల కార్యదర్శి జి.పిచ్చారావు పలుసంఘాల సహాయకులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



సత్తెనపల్లి: త్రుటిలో పెనుప్రమాదం తప్పిన ఘటన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురు శనివారం జరిగింది. సత్తెనపల్లి ఆర్టీసీ బస్టాండ్ ఎదుట టిప్పర్ గుంటూరు వైపు వెళ్తోంది. అదే సమయంలో పిడుగురాళ్ల డిపోకు చెందిన పల్లె వెలుగు హయ్యర్ బస్ బస్టాండ్‌లో నుంచి వేగంగా వస్తూ గుంటూరు వైపు వెళుతున్న టిప్పర్ వెనుక భాగంలో ఢీకొట్టింది. ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేయడంతో ఆర్టీసీ బస్సులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ట్రాఫిక్ స్తంభించడంతో పట్టణ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు, ఏఎస్ఐ సుబ్బారావు, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఆర్టీసీ డ్రైవర్‌ను హెచ్చరించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

నాగిరెడ్డిపాలెంలో మంచినీటి బోరు



బెల్లంకొండ: మండలంలోని నాగిరెడ్డి పాలెంలో ఉన్న ఎస్టీ కాలనీలో 'కేర్ టు షేర్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మంచినీటి బోరును శనివారం గ్రామ నాయకులు ప్రారంభించారు. ఎస్టీ కాలనీలో మంచినీటి సమస్య ఉందని గ్రామస్తులు స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సంస్థ అధ్యక్షుడు సిల్వర్ మోజెష్ మంచినీటి బోరును ఏర్పాటు చేశారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

పాము కాటుకు యువకుడి మృతి

సత్తెనపల్లి: పాముకాటుకు యువకుడు మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం గుడిపూడిలో శనివారం జరిగింది. గుడిపూడి గ్రామానికి చెందిన కె.వీరాంజనేయులు(18) ఇంట్లో నిద్రిస్తుండగా తెల్లవారుజామున పాము లోపలకు ప్రవేశించి కాటు వేసింది. వీరాంజనేయులు పెద్దగా కేకలు పెట్టడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం సత్తెనపల్లి తీసుకురాగా ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి యల్లమందయ్య ఫిర్యాదుపై సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

పెదకూరపాడు: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పెదకూరపాడు ఎస్సై గిరిబాబు శనివారం తెలిపారు. మండలంలోని బలుసుపాడు గ్రామానికి చెందిన వివాహిత ఈనెల 7వ తేదీ రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రపోతానని చెప్పింది. తర్వాత నుంచి కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

యూరియా కొరత.. రైతుల కలత

- అచ్చంపేట మండలంలో కావాల్సిన యూరియా లేదు
- ఒక్కొక్క రైతుకు రెండు కట్టలే..
- వర్షాల నేపథ్యంలో పంటలను బతికించుకునేందుకు తంటాలు
- కొరత లేనప్పుడు బహిరంగంగా ఎందుకు విక్రయించడం లేదని రైతుల ప్రశ్న



అచ్చంపేట పీఏసీఎస్‌లో యూరియా కట్టలు



పూత, పిందె దశకు చేరుకున్న పత్తి పంట

అచ్చంపేట: యూరియా కొరత లేదని నమ్మబలకడానికి ప్రభుత్వం తంటాలు పడుతోంది. రైతులకు కావాల్సినంత యూరియా అందకపోవడంతో కలత చెందుతున్నాడు. ఎరువుల కొరత లేదంటున్న ప్రభుత్వం కావాల్సినంత సరఫరా ఎందుకు చేయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. విక్రయాలను పీఏసీఎస్‌లకే పరిమితం చేస్తున్నారని, బహిరంగ మార్కెట్‌లో ఎమ్మార్పీకి ఎందుకు విక్రయించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం సాగుచేసిన పత్తి, వరి, మొక్కజొన్న పంటలను ఇప్పుడిప్పుడే వేస్తున్న మిర్చి పంటలను రక్షించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

రెండు కట్టలు ఏం సరిపోతాయి

అచ్చంపేట మండలంలో గత ఏడాది మిర్చి పంట గణనీయంగా తగ్గడం, పండిన పంటకు మద్దతు ధర లేక, కనీసం పెట్టుబడులు కూడా రాక, నష్టాల పాలవడంతో ఈ సంవత్సరం రైతులు ఎక్కువగా పత్తి, మొక్కజొన్న పంటలపై మొగ్గుచూపుతున్నారు. చెరువులు, బావులు, కాలువలు, ఎత్తిపోతల పథకాలు అందుబాటులో ఉన్న రైతులు వరి పంట వేశారు. మండలంలో వరి సుమారుగా ఇప్పటికే 7 వేల ఎకరాలకు పైగా వేశారు. మొక్కజొన్న 2 వేల ఎకరాలు, వరి వెయ్యి ఎకరాల్లో సాగుచేస్తున్నారు. మండలం మొత్తం మీద 20 వేలకు పైగా రైతులుంటారు. ప్రస్తుత తరుణంలో పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు సగటున ఎకరాకు కనీసం రెండు కట్టలు యూరియా అయినా వాడాల్సిన అవసం ఉంది. ఒక్కొక్క రైతు ఎకరం నుంచి పది ఎకరాలకు పైగా సాగుచేసే వారు ఉన్నారు. ఇలా చూస్తే 10 ఎకరాలు సాగుచేసే రైతుకు 20 యూరియా కట్టలు సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. రెండు కట్టలు ఇస్తే మేము ఏం చేసుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

పూత దశకు వచ్చిన పత్తి

ముందస్తుగా కురిసిన వర్షాలకు పత్తి వేసిన రైతుల భూముల్లో ప్రస్తుతం పత్తి పూత, పిందె దశకు చేరుకున్నాయి. ఈ తరుణంలో పంట బాగా పెరగాలంటే యూరియా వేయాల్సిన అవసరం ఉంది. పిందెలు, కాయలై, పగిలే దశకు వచ్చాక బలం మందులు వేసినా లాభంలేదని, అప్పటికే దిగుబడి ఆశించినమేర ఉండదని రైతులు చెబుతున్నారు.

పాలకుల పొంతన లేని మాటలు

అధికారులు, పాలకులు చెప్పే మాటలకు సరఫరా చేస్తున్న యూరియాకు సంబంధం ఉండటం లేదు. పత్తికి ఎకరాకు 3 బస్తాలు, మొక్కజొన్నకు ఎకరాకు 3 బస్తాలు, వరికి ఎకరానికి రెండు బస్తాలు వేయాల్సి ఉంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో యూరియా తప్పనిసరిగా వేయాలి. యూరియా సరఫరా కేవలం సహకార సంఘాలకే పరిమితం చేశారు. అచ్చంపేట మండలం మొత్తం అచ్చంపేట, వేల్పూరు సంఘాలనుంచి మాత్రమే తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. గ్రోమోర్‌లో యూరియా ఇవ్వడం లేదు. ఎరువుల డీలర్లు ఈ ఏడాది తమకు అసలు యూరియానే రాలేదని చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో ఇలాంటి పరిస్థితులుంటే జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని కలెక్టర్లు, వ్యవసాయాధికారులు ప్రకటనలు ఇస్తున్నారు. ఆ ప్రకటనలకు, క్షేత్ర స్థాయిలో నెలకొన్న పరిస్థితులకు సంబంధం లేకుండా పోయింది.

గతంలో గ్రామగ్రామాన ఆర్బీకేల్లో సరఫరా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాగ్రామాన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావలసినంత యూరియా, డీఏపీ సరఫరా చేసేవారు. ఇప్పుడు కేవలం సొసైటీలకే పరిమితం చేశారు. మండలంలో రైతులు అచ్చంపేట, వేల్పూరు వచ్చి తెచ్చుకోవల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

కనీసం 20 యూరియా కట్టలు కావాలి



ఐదు ఎకరాల్లో పత్తి, రెండు ఎకరాల్లో మొక్కజొన్న వేశాను. కనీసం 20 యూరియా కట్టలు కావాలి. అలాంటిది రెండు కట్టలు ఇస్తే ఎలా సరిపోతాయి. మా గ్రామంలో ఎరువుల దుకాణాలలో కూడా యూరియా లేదని చెబుతున్నారు. నిజంగా లేదా.. లేక కృత్రిమ కొరత సృష్టించడానికి ఇలా చేస్తున్నారో అర్థం కావడం లేదు. గతంలో మాదిరి గ్రామ గ్రామాన రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతులకు కావలసిన యూరియా, బలం మందులు సరఫరా చేయాలి.

– బోనం నాగిరెడ్డి, రైతు, కోగంటివారిపాలెం

ఆకలితో ఉండకూడదనే ఆహార సేకరణ



అభాగ్యులకు ఆహారాన్ని అందిస్తున్న జనచైతన్య సమితి సభ్యులు

పెదకూరపాడు: ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో మిగిలిన ఆహారాన్ని సేకరిస్తున్నామని అన్నదానం మహా పుణ్యకార్యమని జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు అన్నారు. పెదకూరపాడులోని పట్టాభి రామచంద్రస్వామి (బొమ్మల గుడి రామాలయం) దేవాలయం నిర్మాణం జరిగి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం రాత్రి జరిగిన అన్నదాన కార్యక్రమంలో 300 మందికిపైగా భోజనాలు మిగిలిపోయాయని ఆలయ కమిటీ ప్రతినిధి కొర్లకుంట శ్రీనివాసరావు జన చైతన్య సమితి ప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. జన చైతన్య సమితి ప్రతినిధులు దాసరి విజయ్ బెన్నిబాబు, తుళ్లూరి సాంబశివరావు, బెజ్జం నాగేశ్వరరావు, కమ్మంపాటి కోటేశ్వరరావు మిగిలిన ఆహారాన్ని సేకరించారు. గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాల వద్ద, మార్కెట్ సెంటర్లతో పాటు పెదకాకాని సమీపంలోని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజామున నాలుగున్నర గంటల వరకు మిగిలిన భోజన పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మిగిలిన ఆహారాన్ని వృథా చేయకూడదనే లక్ష్యంతో నిద్రాహారాలు లేకపోయినా ఆకలితో ఉన్నవారికి భోజనం పెట్టడంలో ఎంతో తృప్తి ఉంటుందన్నారు. జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడుదాసరి విజయ్ బెన్నిబాబు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కొర్లకుంట బ్రహ్మం (సింహం), కాకర్ల పరమేశ్వరరావు తదితరులు ఉన్నారు. ఫంక్షన్లలో భోజనాలు మిగిలితే 88867 77767, 98855 57987, 98489 77677 నంబర్లలో సంప్రదించాలని జనచైతన్య సమితి ప్రతినిధులు కోరారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు



ఎమ్మెల్యే లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ బాధ్యులు

సత్తెనపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ సాచివేత ధోరణిని నిరసిస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు నిరసన వారం ఉద్యమ కార్యాచరణలో భాగంగా 3వరోజు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు శనివారం గుంటూరులోని క్యాంప్ ఆఫీస్‌లో ఏపీటీఎఫ్ నాయకులు మెమొరాండం అందించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఒక్క పెండింగ్ బకాయి కూడా విడుదల చేయలేదన్నారు. ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ విద్యారంగ సమస్యల పరిష్కారానికి మంత్రి లోకేష్, సీఎం చంద్రబాబు శ్రద్ధ చూపాలన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా పాత తాలూకా కేంద్రాల్లో, 16న జిల్లా కేంద్రాల్లో ఉపాధ్యాయులతో నిరసన, ప్రదర్శనలు నిర్వహిస్తామని సంఘ నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, గుంటూరు జిల్లా కార్యదర్శి గడిపాటి దాస్, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు బాళ్ల శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ మొహమ్మద్ ఇబ్రాహీం తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించండి

రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు

మాచర్ల రూరల్: రాష్ట్రంలో మూడున్నర లక్షల పెన్షనర్లకు ప్రభుత్వం ప్రకటించాల్సిన పీఆర్‌సీ కమిషన్, ఐఆర్, కరువుభత్యం వెంటనే విడుదల చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేషన్ సమావేశం శనివారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తవుతున్నా ఇంత వరకు పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను విడుదల చేయకపోవడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం పీఆర్‌సీ కమిషన్ వేసి పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను చెల్లించే విధంగా చర్యలు తీసుకొని కేవలం పెన్షన్ పైనే ఆధారపడే ఉద్యోగులను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ సంఘగౌరవ సలహాదారు చంద్రమౌళి రామనాథశర్మ 80వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు అందించారు. సమావేశానికి వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చంద్రయ్య, గాలీబ్‌సాహెబ్, గౌస్, అంజయ్య, రామారావు, నారాయణ, జాన్‌సాహెబ్, మాబు, పాపిరెడ్డి, నాగేశ్వరరావు, కిరీటిరెడ్డి, భాస్కర్‌బాబు, కృష్ణకుమారి, సుజాత, నాగార్జున రాజు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

వైద్యుల సేవలు ఆదర్శనీయం



వైద్యులను సత్కరిస్తున్న వైద్య సిబ్బంది

పెదకూరపాడు: పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్యం అందించి కరోనా విపత్తు సమయంలో త్యాగపూరిత సేవలు అందించిన వైద్యులు కేతావత్ రమేష్ నాయక్, జొన్నలగడ్డ చైతన్య సేవలు ఆదర్శనీయమని విశ్రాంత సివిల్ సర్జన్, పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం మాజీ వైద్యాధికారి రవివర్మ అన్నారు. డెప్యూటీ సివిల్ సర్జన్లుగా పదోన్నతిపై బదిలీ అయిన వైద్యులు రమేష్, చైతన్యలకు శనివారం పెద్దకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో అభినందన సభ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతంలో ఓపీ పెరగడానికి వైద్యులు రమేష్, చైతన్య కృషి చేశారన్నారు. చిన్న వయసులో డెప్యూటీ సివిల్ సర్జన్లుగా పదోన్నతి పొందడం అభినందనీయమని వైద్యాధికారి మండ విద్య అన్నారు. పదోన్నతిపై సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి బదిలీ అయిన డాక్టర్ రమేష్, తణుకు వైద్యశాలకు బదిలీ అయిన డాక్టర్ చైతన్యతో తమకు ఉన్న అనుబంధాన్ని వైద్యులు, సహచర సిబ్బంది గుర్తు చేసుకున్నారు. వారికి అధికారులు రవి వర్మ, విద్య, సహచర వైద్యులు ఆశీర్వాదం, సుజాత, విశ్రాంత హెడ్ నర్స్ లక్ష్మీరాజ్యం ఇతర సిబ్బంది ఘనంగా సత్కరించారు.

రేపు ఆధార్ శిబిరం

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక వైపు ఉన్న శ్రీ రాఘవేంద్ర బాలకుటీర్ పాఠశాలలో ఈ నెల 15న ఆధార్ మార్పులు, చేర్పులకు శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గీతాంజలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల ఆధార్ మార్పు నుంచి పేర్లలో తప్పులు, అడ్రస్ తదితర వాటిని మార్పులు, చేర్పులకు సరైన పత్రాలతో వస్తే ఈ శిబిరంలో చేస్తారని ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో ఒక్క రోజు ఏర్పాటు చేస్తున్న అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 98661 65117, 08641-234234 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

హసనాబాద్(క్రోసూరు): మండలంలోని హసనాబాద్ గ్రామ రైతు షేక్ కందిపాటి నాగులుకు చెందిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. పొలం నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో ఎద్దు రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో మృతి చెందిందని బాధిత రైతు తెలిపాడు. సుమారు రూ.90 వేలు ఖరీదు చేస్తుందని పేర్కొన్నాడు.

కళా ఉత్సవ్ ఫోక్ డ్యాన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరుజిల్లా పరిధిలో నిర్వహించిన కళా ఉత్సవ్-2025 పోటీలలో కే-రిడ్జ్ పాఠశాల విద్యార్థుల బృందం ఫోక్ డాన్స్‌లో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపల్ జి.బర్నబాస్ శనివారం తెలిపారు. బోయపాలెం డైట్ కళాశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈనెల 11, 12 తేదీలలో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీలలో తమ విద్యార్థులు హృదయరెడ్డి, దేవిదీక్ష, లాహిరిరెడ్డి, తేజస్విని, హర్షిని బృందం ఫోక్ డాన్స్ (జానపద నృత్యం)లో ప్రథమ స్థానం సాధించారని వివరించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, డాన్స్ టీచర్లు వెంకట్, జ్యోతిర్మయి అభినందించారు.

రోడ్డుపై ఇసుక లారీ బోల్తా



చాగంటివారిపాలెం సమీపంలో రోడ్డు మార్జిన్‌లో తిరగబడిన లారీ

ముప్పాళ్ళ: సత్తెనపల్లి వైపు నుంచి నరసరావుపేట వైపు ఇసుక లోడుతో వెళుతున్న లారీ చాగంటివారి పాలెం సమీపంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అదుపు తప్పి మార్జిన్‌లోకి బోల్తాపడిన ఘటన శనివారం జరిగింది. ఘటనలో లారీడ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ముప్పాళ్ళ పోలీసులు సంఘటనా స్థలానికి చేరి లారీ డ్రైవర్‌ను నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. లారీలోని ఇసుకంతా మార్జిన్‌లో పడటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

22 నుంచి శరన్నవరాత్రులు

మాచర్ల రూరల్: దసర శరన్నవరాత్రుల మహోత్సవాలను ఈ నెల 22 నుంచి వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రారంభించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు భవనాశి వెంకటేశ్వర్లు, సన్నిధి హనుమంతరావు, జక్కా హరికృష్ణ తెలిపారు. శనివారం ఈ మేరకు అమ్మవారి దేవాలయంలో ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. పాత మాచర్లలోని వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 22న బాల త్రిపుర సుందరీ దేవి, 23న గాయత్రీదేవి, 24న కాళరాత్రిదేవి, 25న వనదుర్గాదేవి, 26న సంతానలక్ష్మీదేవి, 27న ధనలక్ష్మీ దేవి, 28న శైల పుత్రి దేవి, 29న సరస్వతి దేవి, 30న మహకాళిదేవి, అక్టోబర్ 1 మహిషాసురమర్దిని దేవి, 2న పుష్పశయ్య అలంకరణలతో అమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు అర్చకులు శ్రీనివాస శర్మ, దత్తు, రాఘవశర్మలు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గోళ్ళ బాల జనార్దనరావు, మారం సత్యనారాయణ, పి.సత్యనారాయణ, చిన్ని చంద్రం, తుమ్మేపల్లి అంకారావు, జాయింట్ సెక్రెటరీ తిరివీధి వెంకట నాగేశ్వరరావు, భవనాశి రవితేజ, కొత్తమాసు చెన్నకేశవరావు, విజయలక్ష్మి, పరిటాల ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, కొత్త శ్రీదేవి, మేడా వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కష్టాల సాగు

- గట్టెక్కే దారేది
- అతివృష్టి, అనావృష్టితో దెబ్బతిన్న పంటలు
- దిగుబడిపై ప్రభావం



గోళ్లపాడులో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

ముప్పాళ్ళ: రైతు కష్టాల సేద్యం చేస్తున్నాడు. కోటి ఆశలతో ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతుకు చివరకు అప్పే మిగిలేటట్లు కనిపిస్తోంది. సీజన్ ప్రారంభంలో అనావృష్టి, పంటలు చేతికొచ్చే సమయంలో అతివృష్టితో దిగుబడి తగ్గవచ్చని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో ఈ ఏడాది ఇప్పటి వరకు 8,700 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయాల్సి ఉంది. ఖరీఫ్ ప్రారంభమైన తర్వాత దాదాపు 40 రోజులు పాటు వానలు కురవలేదు. ఈ కారణంగా సాగు విస్తీర్ణం తగ్గింది. ఇప్పటి వరకు 7,500 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. 2,425 ఎకరాల్లో పత్తి, 3,750 ఎకరాల్లో వరి, 1,125 ఎకరాల్లో మిరప, 75 ఎకరాల్లో పసుపు పంటతోపాటు కూరగాయల సాగు చేస్తున్నారు.

ఆశలు ఆవిరి

ముందస్తు వానలకు వేసిన పత్తి పూర్తిగా దెబ్బతిని దిగుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో పత్తిసాగు చేసిన రైతులు ఆశలు వదులుకున్నారు.

వర్షాలు కురిసిన తర్వాత వేసిన పంటల్లో ఆరంభంలో పైరు బాగానే ఎదిగింది. పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు, ముసురుతో పంటలు ఎర్రబడి, తెగుళ్లతో కాయలు రాలి.. దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. పత్తి చేలు కలుపుతో నిండిపోయాయి.

వ్యాపించిన తెగుళ్లు

మరోవైపు ఇటీవల సాగు చేసిన వరికి ఎండల తీవ్రతకు తెగుళ్లు వ్యాపించాయి. సాగుకు ఎకరానికి రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. ముసురుతో కాపు కొచ్చిన కాయలు పొలంలోనే రాలిపోతున్నాయి. మళ్లీ వానలు పడుతుండటంతో కాయలు పడిపోతున్నాయి. కనీసం పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదు. అతివృష్టి, అనావృష్టితో దిగుబడుల పైన ప్రభావం చూపనుండటంతో ఈ ఏడాది కూడా రైతులకు అప్పులు తప్పేలా లేవు.

వర్షంతో కలుపు పెరిగింది



ఎకరానికి రూ.పదివేలు చొప్పున కౌలుకు తీసుకొని ఎకరం 75సెంట్లలో పత్తి పంట సాగు చేశా. తీవ్ర ఎండలు కాయటంతో పంట ఎదుగుదల లోపించింది. ఆ తర్వాత ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పత్తి పొలం కలుపుతో నిండిపోయింది. పంట నాణ్యతగా లేదు. ఇప్పటికే రూ.30వేల వరకు ఖర్చు చేశా. ఒక్క రోజు కలుపు తీయడానికే ఐదు వేలు ఖర్చైంది. మళ్లీ కలుపు తీయలేక వదిలేశా.

–మధిర రామస్వామిరెడ్డి, చాగంటివారిపాలెం

రూ.లక్ష వరకు నష్టం



తొలకరి జల్లులకు ఎకరం పది వేలు కౌలుకు తీసుకొని మూడెకరాల్లో పత్తి పంట వేశా. ఎండలు అధికమవడంతో పంట పెరుగుదల నిలిచిపోయింది. ఆ తర్వాత ముసురు తో వచ్చిన కాయలు రాలిపోతున్నాయి. రూ.లక్ష వరకు నష్టం వచ్చింది.

–వీరారెడ్డి, చాగంటివారిపాలెం

నర్సింగ్ విద్యార్థులు అంకితభావంతో పనిచేయాలి

ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ జయకరుణ



నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అతిథులు

నరసరావుపేట రూరల్: నర్సింగ్ వృత్తిలోకి ప్రవేశించే విద్యార్థులు శ్రద్ధ, అంకితభావం, సేవాభావం కలిగి ఉండాలని నరసరావుపేట ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ మేరుగ జయకరుణ తెలిపారు. కృష్ణవేణి నర్సింగ్ కళాశాలలో శనివారం లాంప్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఏరియా హాస్పిటల సూపరింటెండెంట్ జయకరుణ, ఏరియా హాస్పిటల్ హెడ్‌నర్స్ విజయకుమారిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి పవిత్రమైనదని తెలిపారు. వైద్యుల తర్వాత ఈ వృత్తిలో నర్సులకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. ధనిక, పేద సంబంధం లేకుండా అందరికీ సమానమైన సేవలు అందించాలని తెలిపారు. రోగులకు మనోధైర్యాన్ని నింపడంతో పాటు జబ్బులను నయం చేసే కీలకపాత్ర నర్సులదని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నూతలపాటి జోష్న, కందుల ఉదయలక్ష్మి, మౌనిక, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాధినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ

అచ్చంపేట/క్రోసూరు: అచ్చంపేట తహసీల్దారుగా ఎస్.చంద్రశేఖర్, క్రోసూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బెల్లంకొండ తహసీల్దార్ టి.ప్రవీణ్‌కుమార్ శనివారం అదనపు బాధ్యతలు తీసుకున్నారు. అచ్చంపేటలో గత ఆరునెలల్లో ముగ్గురు తహసీల్దార్లు మారారు. అలాగే క్రోసూరు తహసీల్దార్‌గా పని చేస్తున్న వి.వి.నాగరాజు నెలాఖరు వరకు వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో బెల్లంకొండ తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలను కలెక్టర్ అప్పగించినట్లు డెప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

దాచేపల్లి: లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. నగర పంచాయతీలోని మనుషుర్లా పేటకు చెందిన వంగర సుకుమార్(20) కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. పనులు చేసుకుని ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఘటనలో సుకుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి తాత ఇన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు.

రసం పీల్చే పురుగులపై అప్రమత్తం

అమరావతి: ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టాయని రైతులు నత్రజని సంబంధిత ఎరువులను ఎక్కువగా వాడటంతో రసం పీల్చే పురుగులు పత్తి పైరును ఆశించే అవకాశం ఉందని మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ అన్నారు. శనివారం ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం దెబ్బతిన్న పత్తి స్థానంలో ప్రత్యామ్నాయంగా మినుము పంటకు టి.9 విత్తనం వాడటం మంచిదన్నారు.